ప్రచురణార్హమైన

భారతదేశ సర్వోన్నత న్యాయస్థానము
క్రిమినల్ ఒరిజినల్ జ్యూరిస్డిక్షన్
రిట్ పిటిషన్ (క్రిమినల్) నెం. 60/2023

**రీతూ ఛబరియా.** ...**ధరఖాస్తుదారురాలు**

**వర్సెస్**

**యూనియన్ ఆఫ్ ఇండియా మరియు ఇతరులు** ... **ప్రతివాదులు**

# తీర్పు

**గౌరవ న్యాయమూర్తి కృష్ణ మురారి.**

1. తప్పనిసరిగా ఇవ్వవలసిన జామీనుపై తన భర్తను విడుదల చేయాలని కోరుతూ భారత రాజ్యాంగంలోని ఆర్టికల్ 32 కింద ప్రస్తుత రిట్ ధరఖాస్తును, రిట్ ధరఖాస్తుదారురాలు దాఖలు చేశారు. భారత రాజ్యాంగంలోని ఆర్టికల్ 21 కింద పొందుపరచబడిన వ్యక్తిగత స్వేచ్ఛ యొక్క తీవ్రమైన ప్రాముఖ్యత అంశాన్ని కూడా ఈ రిట్ ధరఖాస్తు లేవనెత్తుతున్నది.

**వాస్తవాలు:**

2. క్లుప్తంగా, ప్రస్తుత రిట్ ధరఖాస్తునకు సంబంధించిన వాస్తవాలు ఏమిటంటే, భారత శిక్షాస్మృతి, 1860 (సంక్షిప్తంగా, 'ఐపిసి') లోని సెక్షన్ 120 (బి) తో పాటు సెక్షన్ 7, 12 మరియు 13 (2) తో మరియు అవినీతి నిరోధక చట్టము, 1988 లోని సెక్షన్ 13 (1) (డి) కింద నమోదు చేయబడిన ఎఫ్ఐఆర్ లో ప్రస్తుత రిట్ ధరఖాస్తుదారురాలి భర్త పేరు చేర్చబడలేదు.

3. తదనంతరం, రెండు అనుబంధ చార్జిషీట్లను దాఖలు చేశారు. రిట్ ధరఖాస్తుదారురాలి భర్త **(ఇకపై "నిందితుడు" గా వ్యవహరించబడుదురు )** ను తేదీ 26.05.2020 నాటి అనుబంధ ఛార్జ్ షీట్ లో ప్రాసిక్యూషన్ సాక్షిగా చూపినారు. తరువాత అనేక ఇతర అనుబంధ ఛార్జ్షీట్లు దాఖలు చేయబడ్డాయి, కానీ ఆ చార్జి షీట్లలో వేనిలోనూ నిందితుడి పేరు లేదు.

4. తదుపరి దర్యాప్తు మరొక దర్యాప్తు అధికారికి బదిలీ చేయబడింది, ఆపైన నిందితుడిని సిబిఐ అరెస్టు చేసి తేదీ 28.04.2022 న కస్టడీకి రిమాండ్ చేసినది. తర్వాత అనేక ఇతర అనుబంధ చార్జి షీట్లు దాఖలు చేయబడ్డాయి, ఇందులో నిందితుడిని అనుమానితుడిగా పేర్కొన్నారు, మరియు క్రిమినల్ ప్రొసీజర్ కోడ్, 1973 (సంక్షిప్తంగా, 'సిఆర్.పిసి') లోని సెక్షన్ 309 (2) కింద నిందితుడి రిమాండ్ ఎప్పటికప్పుడు కొనసాగించబడింది, మరియు అతడు తప్పనిసరిగా ఇవ్వవలసిన జామీనుపై ఎప్పుడూ విడుదల కాలేదు.

5. తదనంతరం, ఐ. ఎ. నెం. 37424/2023 ద్వారా, ధరఖాస్తుదారురాలు తన ధరఖాస్తులో జామీను కోరుతూ దానికి అదనపు ఆధారాలు మరియు ప్రార్థనలను చేర్చాలని కోరారు, దీనిని ఈ కోర్టు 20.02.2023 నాటి ఉత్తర్వు ద్వారా అనుమతించింది మరియు మధ్యంతర జామీను మంజూరు చేయబడింది.

6. కస్టడీ కొనసాగింపునకు మరియు తప్పనిసరిగా ఇవ్వవలసిన జామీను ఉపశమనానికి అడ్డుకట్ట వేయడానికి వ్యతిరేకంగా, ధరఖాస్తుదారురాలు ప్రస్తుత రిట్ ను దాఖలు చేశారు. రిట్ ధరకాస్తుదారురాలి ప్రకారం దాఖలు చేసిన ప్రతి అనుబంధ చార్జి షీట్ , ఆమె భర్తను తప్పనిసరిగా ఇవ్వవలసిన జామీనుపై విడుదల కాకుండా చూచుటకు చేసిన ప్రయత్నము.

**ధరఖాస్తుదారురాలు ప్రతిపాదించిన వాదనలు:**

7. **ధరఖాస్తుదారురాలి** తరపున గౌరవ న్యాయవాది ఇలా వాదించారుః

I. దర్యాప్తు ఇంకా పెండింగ్ లో ఉందని ప్రతివాది అనుబంధ చార్జి షీట్ లో లిఖితపూర్వకంగా అంగీకరించారు. దాని దృష్ట్యా ట్రయల్ కోర్టు సమన్లను జారీ చేసి, ధరఖాస్తుదారురాలి భర్తను సెక్షన్ 309 Cr.PC కింద రిమాండ్ చేసియుండకూడదు.

II. దర్యాప్తు పూర్తి కాలేదనే కారణంతో నిరంతర నిర్బంధం కారణంగా నిందితుల ప్రాథమిక హక్కులు భంగకరమవుతున్నాయి. దర్యాప్తు ఇంకా కొనసాగుతున్నట్లయితే 60 రోజులకు మించి కస్టడీని కొనసాగించే అధికారం సిఆర్పిసిలోని నిబంధనల ప్రకారం లేదని వాదించారు. ఇందుకు మద్దతుగా, గౌరవ న్యాయవాది క్రింది తీర్పుపై ఆధారపడ్డారు.

**ఎం. రవీంద్రన్ వర్సెస్ ఇంటెలిజెన్స్ ఆఫీసర్, డైరెక్టరేట్ ఆఫ్ రెవెన్యూ ఇంటెలిజెన్స్((2021) 2 SCC 485)**

**ప్రతివాది ముందుకు తెచ్చిన వాదనలు:**

8. ప్రతివాది తరపున హాజరైన గౌరవ న్యాయవాది ఇలా వాదించారుః

I. ప్రస్తుత రిట్ నిర్వహించదగినది కాదు, మరియు జామీను మంజూరు కోసం, నిందితుడు తప్పనిసరిగా ఇవ్వవలసిన జామీనును తిరస్కరించిన మేజిస్ట్రేట్ ఆదేశానికి వ్యతిరేకంగా హైకోర్టును ఆశ్రయించి ఉండాలి లేదా ఆ ఉత్తర్వుకు వ్యతిరేకంగా భారత రాజ్యాంగంలోని ఆర్టికల్ 136 లోని నిబంధనల క్రింద స్పెషల్ లీవ్ పిటిషన్ దాఖలు చేసి ఉండాలి.

II. ఎఫ్ఐఆర్ లో నిందితుడి పేరు లేదన్న ధరఖాస్తుదారురాలి వాదన సంగతమైన సమర్పణ కాదు, ఎందుకంటే ఎఫ్ఐఆర్ పూర్తి పత్రం కాదు, మరియు (ఇది) క్రిమినల్ ప్రక్రియను ప్రారంభించడానికి మొదటి అడుగు మాత్రమే. తన ఈ వాదనకు మద్దతుగా గౌరవ న్యాయవాది క్రింది కేసుపై ఆధారపడ్డారు:

**బీహార్ రాష్ట్రం & ఇతరులు వర్సెస్ జె. ఎ. సి సల్దాన్హా & ఇతరులు. ((1980) 1 SCC 554)**

III. తేదీ 25.06.2022 న దాఖలు చేసిన అనుబంధ చార్జి షీట్ అనేది ఈ అనుబంధ చార్జి షీట్ లో పేర్కొన్న వ్యక్తులు చేసిన నేరానికి సంబంధించిన పూర్తి పత్రం, అందువల్ల, ధరఖాస్తుదారురాలి భర్తకు తప్పనిసరిగా ఇవ్వవలసిన జామీను పొందే హక్కు లేదు.

**అంశములు:**

9. కక్షిదారుల తరపున గౌరవ న్యాయవాదులు లేవనెత్తిన, పైన పేర్కొన్న వాదనల దృష్ట్యా, మా పరిశీలన కోసం ఈ క్రింది మూడు ప్రశ్నలు తలెత్తుతాయిః–

I. మొదట కేసు దర్యాప్తును పూర్తి చేయకుండా చార్జి షీట్ లేదా ప్రాసిక్యూషన్ ఫిర్యాదును ముక్కలు ముక్కలుగా దాఖలు చేయవచ్చా?

II. దర్యాప్తు పూర్తి చేయకుండా అటువంటి చార్జి షీట్ దాఖలు చేయడం నిందితుడి యొక్క తప్పనిసరిగా ఇవ్వవలసిన జామీను హక్కును తుడిచివేస్తుందా?

III. సిఆర్పిసి నిర్దేశించిన సమయానికి మించి దర్యాప్తు పెండింగ్ లో ఉన్నప్పుడు ట్రయల్ కోర్టు నిందితుడి రిమాండ్ ను కొనసాగించగలదా?

**ప్రాథమిక ఆక్షేపణ:**

10. దర్యాప్తు యొక్క ప్రారంభ దశలో ఎటువంటి ఉపశమనము మంజూరు చేయకూడదు కాబట్టి ప్రస్తుత రిట్ ఈ కోర్టు ముందు నిర్వహించబడకూడదని పేర్కొంటూ, ప్రతివాది తరపున హాజరైన గౌరవ న్యాయవాది, ప్రాథమిక అభ్యంతరాన్ని లేవనెత్తారు.

11. మేము ఈ ప్రాథమిక అభ్యంతరాన్ని పరిగణనలోకి తీసుకున్నాము, అయితే, మేము దీనితో ఏకీభవించడానికి సిద్దంగా లేము. గుర్తుంచుకోవాల్సిన విషయం ఏమిటంటే, మన రాజ్యాంగం వ్యక్తుల యొక్క మరియు సమాజం యొక్క పౌర స్వేచ్ఛను రక్షించడమనే ముఖ్యమైన పనిని సర్వోన్నత న్యాయస్థానానికి అప్పగించింది. ప్రాథమిక హక్కుల రూపంలో వ్యక్తపరచబడుతున్న ఈ పౌర స్వేచ్ఛ అనేది ప్రభుత్వానికి మరియు ప్రజలకు మధ్య గల సాంఘీక ఒప్పందంలోని అధికారాలలోని అంతరాయాల గురించి సమర్ధవంతంగా సంప్రదింపులు చేయడానికి వీలు కలిగిస్తుంది. పౌర స్వేచ్ఛ ఉల్లంఘన జరిగిన కేసులపై తన అధికార పరిధిని వినియోగించడానికి సాంకేతిక కారణాల వలన ఈ కోర్టు అంగీకరించకపోయినట్లైతే , అది ఈ సాంఘీక ఒప్పందాలు పని చేయకుండా ఉండడమనే సంచలనాత్మక ప్రభావానికి దారి తీయడం వలన ఈ దేశ ప్రజలు ప్రభుత్వం యొక్క ఇష్టానుసారమైన మరియు విశృంఖలమైన నిరంకుశత్వానికి గురి అవుతారు.

12. ఈ భాగం ద్వారా ఒసగబడిన హక్కులను అమలు జరుపుటకు భారత రాజ్యాంగంలోని ఆర్టికల్ 32 పరిష్కారాలను అందిస్తుంది. ఈ ఆర్టికల్ (ఆర్టికల్ 32) ఈ క్రింది విధంగా ఉంది:–

*"32. ఈ భాగం ద్వారా ఒసగబడిన హక్కులను అమలు జరుపుటకు పరిష్కారాలు —*

(1) ఈ భాగము ద్వారా ప్రదత్తమైన హక్కులను అమలు పరచుటకు సముచిత చర్యల ద్వారా సర్వోన్నత న్యాయస్థానమును అర్థించు హక్కుకు హామీ ఈయబడినది.

(2) ఈ భాగము ద్వారా ప్రదత్తమైన ఏవేని హక్కులను అమలు పరచుట కొరకు ఆదేశములను , లేక ఉత్తరువులను లేక బందీ ప్రత్యక్ష (హెబియస్ కార్పస్), పరమాదేశ ( మాండమస్), ప్రతినిషేధ(ప్రొహిబిషన్), అధికార పృచ్ఛ (కో వారెంటో) మరియు ఉత్ప్రేషణ (సర్షియోరారి) స్వభావము గల అధిలేఖల ( రిట్ల)తో సహా అధిలేఖలను, వీటిలో సముచితమైన దానిని జారీ చేయుటకు సర్వోన్నత న్యాయస్థానము అధికారము కలిగియుండును.

(3) ఖండములు (1) మరియు (2) ద్వారా సర్వోన్నత న్యాయస్థానమునకు ప్రదత్తమైన అధికారములకు భంగము కలుగకుండ ఖండము (2) క్రింద సర్వోన్నత న్యాయస్థానముచే వినియోగింపబడదగు అధికారములన్నిటినిగాని వాటిలో దేనినైననుగాని ఏదేని ఇతర న్యాయస్థానమునకు దాని అధికారిత యొక్క స్థానిక హద్దులలో వినియోగించు అధికారమును, శాసనము ద్వారా పార్లమెంటు ఒసగవచ్చును.

(4) ఈ అనుచ్ఛేదముచే హామీ ఈయబడిన హక్కు ఈ సంవిధానముచే అన్యథా నిబంధింపబడినట్లు తప్ప, సస్పెండు చేయబడరాదు."

ఆర్టికల్ 32 ప్రాథమిక హక్కులతో వ్యవహరించే రాజ్యాంగంలోని పార్ట్ III పరిధిలోకి వస్తుంది, అందువల్ల ఆర్టికల్ 32ని ఉపయోగించుకునే హక్కు అనేది కూడా ఒక ప్రాథమిక హక్కు, ఇది రాజ్యాంగంలోని పార్ట్ III ద్వారా హామీ ఇవ్వబడిన ఇతర ప్రాథమిక హక్కులను పరిరక్షిస్తుంది మరియు కాపాడుతుంది. ఈ న్యాయస్థానం యొక్క రాజ్యాంగ ధర్మాసనం **కె. ఎస్. పుట్టస్వామి & మరొకరు వర్సెస్ యూనియన్ ఆఫ్ ఇండియా & ఇతరులు ((2017) 10 ఎస్సీసీ 1)**:– కేసులో చేసిన ఈ క్రింది పరిశీలనలను మేము ఉపయోగకరంగా సూచించవచ్చు:

> *"పౌరుల హక్కులను, స్వేచ్ఛను చట్ట నియమావళి రక్షిస్తుందన్న ఘూడత చెదరని భరోసా ఉన్నప్పుడు మరియు పౌరుల యొక్క ఈ విలువైన హక్కులు ప్రభుత్వ దాడి వలన రిక్తపరచబడినప్పుడు, జవాబులు ఆశించే అన్వేషణాపూర్వక ప్రశ్నలు అడగగలిగిన న్యాయ ప్రక్రియలు అందుబాటులో ఉన్నప్పుడే రాజ్యాంగ బద్ధమైన ప్రజాస్వామ్యం మనుగడ సాగించగలదు."*

13. ఇంకా, **కె. కె. కొచున్ని, మూపిల్ నాయర్ వర్సెస్ స్టేట్ ఆఫ్ మద్రాస్ & ఇతరులు ( 1959 సప్లిమెంట్ (2) ఎస్సిఆర్ 316) కేసులో** 1959 వ సంవత్సరంలోనే ఈ కోర్ట్ యొక్క మరొక రాజ్యాంగ ధర్మాసనం, ప్రాథమిక హక్కుల దురుపయోగము ఉన్న విషయాలలో న్యాయస్థానం తన అధికార పరిధిని ఉపయోగించాలని గమనించింది. ఈ తీర్పులో చెప్పిన ఇందుకు సంబంధించిన పేరాలు క్రింద పొందుపరచబడ్డాయిః

> *"ఇంకా, హై కోర్ట్ రాజ్యాంగంలోని ఆర్టికల్ 226 కింద చేసిన దరఖాస్తు మీద విశిష్టాధికార రిట్ లలో ఏదైనా ఇవ్వవచ్చునా అనే అంశాన్ని నిర్ణయించేటప్పుడు, ఇతరమైన తగిన చట్ట ప్రక్రియ ఉన్నదా అనే విషయాన్ని పరిగణనలోకి*

*తీసుకోవచ్చు – ఈ విషయం గురించి ఇప్పుడే చెప్పము – కానీ , ఇదే కారణంతో తగిన కార్యకలాపాల ద్వారా , ఆర్టికల్ 32 కింద దాఖలు చేసిన ధరఖాస్తును ఈ కోర్టు తిరస్కరించజాలదు. ఎందుకంటే ఒకటవ విభాగం క్రింద ఉన్న హక్కులను అమలు పరచడం అనేది హామీతో కూడిన ఒక హక్కే అయి ఉండడం వలన. తదనుగుణంగానే , రాజ్యాంగం ఈ కోర్టును ప్రాథమిక హక్కుల పరిరక్షకుడు మరియు హామీదారుగా ఏర్పాటు చేసినందున, ఏకకాలిక అధికార పరిధి కలిగిన హైకోర్టు ముందు మొదటగా దరఖాస్తు చేయకుండా ఈ కోర్టు ముందే ధరఖాస్తును చేసియున్నా కానీ , అటువంటి హక్కుల ఉల్లంఘనకు వ్యతిరేకంగా రక్షణ కోరుతూ చేసిన దరఖాస్తులను స్వీకరించడానికి నిరాకరించడం జరగదని రొమేష్ థాపర్ వర్సెస్ మద్రాసు రాష్ట్రం [1950 ఎస్. సి. సి. 436 1950 ఎస్. సి. ఆర్ 594] కేసులో ఈ కోర్టు పేర్కొన్నది. ఒక ప్రాథమిక హక్కు ఉనికి మరియు దాని ఉల్లంఘన, దాని వాస్తవమైన ఉల్లంఘన లేక దాని బెదిరింపుల ఆరోపణలు ఒక ఆర్టికల్ 32 క్రింద దాఖలు కాబడిన ధరఖాస్తులో చేయబడినప్పుడు , కేవలము ఒక ప్రత్యామ్నాయ న్యాయ ప్రక్రియ ఉనికిలో ఉన్నదన్న కారణం ఆ ధరఖాస్తును త్రోసిపుచ్చాడానికి సరిపోవునంత మంచి ఆధారం కాదు."*

14. Cr.PC లోని సెక్షన్ 167 (2) క్రింద తప్పనిసరి జామీను అనబడే ఉపశమనం భారత రాజ్యాంగంలోని ఆర్టికల్ 21 నుండి నేరుగా లభించే ఒక ప్రాథమిక హక్కు అయినందున, ఆ హక్కు యొక్క ఉల్లంఘన, పైన పేర్కొన్న విధంగా నేరుగా రాజ్యాంగంలోని ఆర్టికల్ 32 క్రింది పరిశీలనను ఆకర్షిస్తుంది. ఈ పరిస్థితిలో , ప్రతివాది తరపున గౌరవ న్యాయవాది, రాజ్యాంగంలోని ఆర్టికల్ 32

క్రింద ఈ దరఖాస్తు యొక్క నిర్వహణకు సంబంధించి లేవనెత్తిన ప్రాథమిక అభ్యంతరాలతో మేము ఏకీభవించము, అందువల్ల ఆ అభ్యంతరం తిరస్కరించబడినది.

**విశ్లేషణ:**

15. ఈ కేసులో నిర్ణయించిన అంశాలను పరిశీలించే ముందు , కేసు యొక్క యోగ్యతాయోగ్యతలను గురించిన పరిశీలనలు చేయడానికి ఈ కోర్టు మొగ్గు చూపడం లేదని చెప్పడం భావ్యం అనుకుంటున్నాము. ప్రతి కోర్టు దాని అధికార పరిధి వినియోగం కోసం కోరినప్పుడు , అది తన ముందు కోరిన ఉపశమనలను గమనించి ఆ ఉపశమనలకు అవసరమైనంత వరకే చర్యలు తీసుకోవాలి. ఈ కేసుకు సంబంధించిన వరకు ఈ కోర్టు అప్పీల్ కోర్టు కాదు ఒక రిట్ కోర్టు మాత్రమే. అందువల్ల రిట్ ధరఖాస్తుదారురాలి భర్త యొక్క వ్యక్తిగత స్వేచ్ఛ మరియు దానికి సంబంధించిన వివాదాస్పద చట్ట విషయాలు, ఈ అంశాలకు మాత్రమే, ఈ కోర్టు యొక్క అధికార పరిధిని పరిమితం చేయడానికి ఈ కోర్టు మొగ్గు చూపుతుంది.

16. మేము నిర్ణయించిన అంశాల గురించిన పరిష్కారాలను కనుగొనే ఉద్దేశంతో , తప్పనిసరి జామీను నిబంధన యొక్క చరిత్రను మరియు కొత్త అధిశాసనములో ఇప్పటికే ఉన్న నిబంధనలను శాసన మండలి చేర్చడానికి దారితీసిన కారణాలను గుర్తించాల్సిన అవసరం ఉందని మేము భావిస్తున్నాము. ప్రస్తుతం అమలులో ఉన్న సిఆర్పిసి అమలులోనికి వచ్చే ముందు నేర సంబంధమైన కేసులను నిర్వహించే చట్టమైన కోడ్ ఆఫ్ క్రిమినల్ ప్రొసీజర్, 1898 లోని సెక్షన్ 167 ప్రకారం, జ్యుడీషియల్ లేదా పోలీసు కస్టడీలో ఉన్న నిందితుడిని గరిష్టంగా 15 రోజుల పాటు మాత్రమే రిమాండ్ చేయవచ్చు. సులభంగా గమనించడం కోసం 1898 కోడ్ లోని సెక్షన్ 167 ఈ క్రింద పొందుపరచబడింది: –

**“ఇరవై నాలుగు గంటల సమయము లోగా దర్యాప్తు పూర్తి చేయలేనప్పుడు (చేయవలసిన) ప్రక్రియ–** (1) ఎవరినైనా ఒక వ్యక్తిని అరెస్టు చేసి అదుపులోకి తీసుకున్నప్పుడు సెక్షన్ 61లో నిర్ణయించబడిన విధంగా , ఇరవై నాలుగు గంటలలోగా దర్యాప్తును ముగించలేమని అనిపించినప్పుడు , చేయబడిన ఆరోపణలు ఆధారసహితమైనవని నమ్మడానికి ఆధారాలు ఉన్నప్పుడు , దర్యాప్తు చేస్తున్న అధికారి పోలీస్ స్టేషన్ ఇన్చార్జ్ అధికారి లేదా పోలీస్ స్టేషన్ ఇన్చార్జ్ పోలీసు అధికారి లేదా సబ్ ఇన్స్పెక్టర్ స్థాయి కంటే తక్కువ అధికారి కాకపోతే, అతడు ఆరోపణలకు సంబంధించిన కేసు డైరీలో నమోదు చేయబడిన అంశాల యొక్క కాపీని వెంటనే సమీపంలో ఉన్న మేజిస్ట్రేట్ నకు పంపించాలి, అదే సమయంలో నిందితుడిని కూడా అటువంటి మేజిస్ట్రేట్ ముందు హాజరు పర్చాలి.
(2) ఈ సెక్షన్ క్రింద ఏ మేజిస్ట్రేట్ ముందునకు నిందితుడు పంపబడతారో, ఆయనకు కేసును విచారించే అధికారం ఉన్నా లేకపోయినా, ఆ మేజిస్ట్రేట్ సబబుగా భావిస్తే కస్టడీలో నిందితుడిని మొత్తం పదిహేను రోజులకు మించని కాలానికి నిర్బంధించడానికి ఆదేశం ఇవ్వవచ్చు. కేసును విచారించడానికి లేదా విచారణకు అప్పగించడానికి అతనికి అధికార పరిధి లేకపోతే, మరియు మరింత నిర్బంధం అనవసరమని భావిస్తే, అతను నిందితుడిని అటువంటి సరియైన అధికార పరిధి ఉన్న మేజిస్ట్రేట్ ముందునకు పంపమని ఆదేశించవచ్చు:
అయితే, ఏ మూడవ తరగతి మేజిస్ట్రేట్ కానీ లేక ఇందుకు గానూ రాష్ట్ర ప్రభుత్వం చేత ప్రత్యేక అధికారం ఇవ్వబడని ఏ రెండవ తరగతి మేజిస్ట్రేట్ కానీ, పోలీసు కస్టడీలో నిర్బంధించడానికి ఆదేశాలు ఇవ్వకూడదు.

*(3) ఈ సెక్షన్ క్రింద పోలీసు కస్టడీలో నిర్బంధించడానికి ఆదేశం ఇచ్చే మేజిస్ట్రేట్ అలా చేయడానికి గల కారణాలను నమోదు చేయాలి.*

*(4) జిల్లా మేజిస్ట్రేట్ లేదా సబ్ డివిజనల్ మేజిస్ట్రేట్ కాకుండా వేరే మేజిస్ట్రేట్ అటువంటి ఉత్తర్వు ఇచ్చినట్లయితే, అతను తన ఉత్తర్వు యొక్క కాపీని, దానిని చేయడానికి గల కారణాలతో సహా , వెంటనే తాను అధీనంలో ఉన్న మేజిస్ట్రేట్ నకు పంపాలి."*

17. అయితే, చాలా సంధార్భాలలో ముఖ్యంగా సుదీర్ఘమైన మరియు లోతైన దర్యాప్తు అవసరమయ్యే సంక్లిష్టమైన కేసులలో దర్యాప్తు ముగించడానికి ఈ 15 రోజుల వ్యవధి సరిపోవడం లేదు. పైన చెప్పిన 1898 చట్టములోని నిబంధనల వలన కలిగే ఈ సమయాభావం వలన సమయం మించక ముందే ప్రాథమిక చార్జిషీట్లను దాఖలు చేసే విస్తృతమైన విధానానికి దారి తీస్తుండడం జరిగినది. రిమాండ్ వ్యవధి ముగిసిన తర్వాత దర్యాప్తు అధికారులు ప్రాథమిక చార్జి షీట్ లను దాఖలు చేసి1898 చట్టములోని సెక్షన్ 344 క్రింద ముద్దాయిని రిమాండ్ చేసి విచారణ ప్రారంభాన్ని చివరి చార్జి షీటు దాఖలు చేసే వరకు వాయిదా వేయమని అభ్యర్థించడం జరుగుతూ ఉండేది.

18. లా కమీషన్ న్యాయ పరిపాలనా సంస్కరణల గురించి తాను ఇచ్చిన 14 వ నెంబర్ రిపోర్ట్ (Law Commission of India in Report No. 14, Vol.–I (1958).) లో ఈ విధముగా ప్రాథమిక చార్జిషీటులను దాఖలు చేసే విధానాన్ని ఎత్తి చూపుతూ, ఇందువలన చాలా కేసులలో వివరణాత్మకమైన నివేదికలను దర్యాప్తు అధికారులు కోర్టుల ముందు ఉంచకపోవడం వలన నిందితులు చాలా కాలం కారాగారాలలో మగ్గుతున్నారని తెలిపినది. ఇందువలన, నిందితుల యొక్క వ్యక్తిగత స్వేచ్ఛను పరిరక్షించడానికి , దర్యాప్తు పూర్తి చేయడానికి సరియైన కాల వ్యవధిని నిర్ణయించగల నిబంధనను వెంటనే ఏర్పరచాల్సిన అవసరం ఉన్నదని ప్రతిపాదించడం జరిగినది.

19. పైన పేర్కొన్న లా కమిషన్ యొక్క ప్రతిపాదనలను తన 41వ నెంబర్ నివేదిక (Law Commission in its Report No. 41 (September,1969), Para. 14.19.)లో లా కమీషన్ మళ్ళీ నొక్కి వక్కాణించడం జరిగినది . 1898 చట్టము లోని సెక్షన్ 344 దుర్వినియోగపరుస్తూ ప్రాథమిక నివేదిక మరియు దర్యాప్తు పూర్తి కాకపోవడం అనే కారణాలను చూపుతూ నిందితులను నిరవధికంగా రిమాండ్ లో ఉంచడం జరుగుతున్నదనియు వారి వ్యక్తిగత స్వేచ్చను రక్షించడం అనేది అత్యవసరమనియు ఇందులో స్పష్టం చేయడం జరిగినది. ఈ నివేదికలోని సంబంధిత పేరాలను ఈ క్రింద పొందుపరచడం జరిగినది:–

> *"సెక్షన్ 167 నిర్బంధముల గురించి నిర్దేశిస్తున్నది. పోలీసు కస్టడీ క్రింద కానీ జ్యుడీషియల్ కస్టడీ క్రింద కానీ ఒక అరెస్టైన వ్యక్తిని నిర్బంధించగల మొత్తం వ్యవధి 15 రోజులు. ఈ 15 రోజుల్లోగా దర్యాప్తును పూర్తి చేసి, సెక్షన్ 173 కింద తుది నివేదికను కోర్టునకు పంపాలని ఇందులోని భావన . కానీ , వాస్తవ ఆచరణలో, ఇది ఆచరణాత్మకం కాదని తరచుగా రుజువు అయినది. నేరాలు తీవ్రమైనపుడు క్లిష్టతరమైన దర్యాప్తులను 15 రోజుల్లోగా పూర్తి చేయలేకపోవడం వలన, తరచుగా పోలీసు వారు నిందితుడిని పోలీసు కస్టడీలో ఉంచమని అడగడం సహజమే. అందువలన అనుమానాస్పద చట్టపరమైన ప్రామాణికత యొక్క అభ్యాసం పెరిగింది. పోలీసులు "అసంపూర్ణమైన" ప్రాథమిక నివేదికను కోర్టు ముందు ఉంచడం మరియు సెక్షన్ 344 క్రింద చర్యలు తీసుకుంటూ మేజిస్ట్రేట్ ఆ కేసును వాయిదా వేయడం ముద్దాయిని నిర్బండానికి పంపడం జరుగుతూ ఉన్నది. ఈ విధానం యొక్క చట్టబద్ధతను లా కమీషన్ తన 14 వ రిపోర్ట్ లో శంకించడం జరిగినది. ఎందుకంటే సెక్షన్ 344*

లో ఉద్దేశించబడిన ప్రకారం , మేజిస్ట్రేట్ సెక్షన్ 173 క్రింద తుది నివేదికను అందుకుని, నిందితునిపై ఆరోపించబడిన నేరాన్ని తన అధికార పరిధిలో గుర్తించిన తర్వాత మాత్రమే , ఈ సెక్షన్ క్రింద ఉత్తర్వులు ఇవ్వగలరు. కానీ , దర్యాప్తు ఇంకా పెండింగ్ లో ఉన్నప్పుడు కాదు. మేము కూడా ఇదే అభిప్రాయంతో ఉన్నాము, ఈ విషయానికి గానూ చట్టము స్పష్టీకరణ చేయడం అవసరమని మేము భావిస్తున్నాము. అరెస్ట్ అయిన వ్యక్తిని సెక్షన్ 167 క్రింద చట్ట బద్ధంగా విధించబడిన కాల వ్యవధిని మించి మరియు నిరవధికంగా నిర్బంధంలో ఉంచుతూ, నిదానంగా దర్యాప్తును పూర్తి చేయడం అనేది సెక్షన్ 344 ను పూర్తిగా దుర్వినియోగపరచడము అవుతుంది కాబట్టి ఇది సరియైనది కాదు. అందువలన 14 వ నివేదిక లో చెప్పబడినట్లుగా దర్యాప్తు కొనసాగే సమయంలో పోలీసులు నిర్బంధం కోసం అడిగే అధికారానికి కొంత కాల వ్యవధిని నిర్ణయించడం అవసరమని మేము భావిస్తున్నాము ; మరియు ప్రస్తుతం ఉన్న 15 రోజుల వ్యవధి చాలా తక్కువ అనిపించినట్లైతే , చట్టపరమైన రక్షణ స్ఫూర్తిని ఉల్లంఘించే అభ్యాసాన్ని అంగీకరించడం కంటే, ఎక్కువ కాల వ్యవధిని నిర్ణయించడం మంచిది. ముందటి లా కమీషన్ వారు భావించినట్లుగానే మేము కూడా 15 రోజుల వ్యవధి చాలా తక్కువ అని భావిస్తున్నాము, అందువల్ల 14 వ నివేదికలో ప్రతిపాదించినట్లుగానే సెక్షన్ 167 కింద గరిష్ఠ వ్యవధిని 60 రోజులుగా నిర్ణయించాలని మేము కూడా ప్రతిపాదిస్తున్నాము. అటువంటి పొడిగింపు వలన ప్రతి సందర్భంలోనూ ఈ గరిష్ట వ్యవధి నిత్యకృత్యంగా మారే ప్రమాదం ఉన్నదని కూడా మాకు తెలుసుః కానీ ఉన్నత న్యాయస్థానాల యొక్క సరైన పర్యవేక్షణ దీనిని నిరోధించగలదని మేము నమ్ముతున్నాము.

తదనుగుణంగా ఈ క్రింది విధంగా సెక్షన్ 167 యొక్క (2) మరియు (4) సబ్ సెక్షన్లు సవరించబడాలని మేము ప్రతిపాదిస్తున్నాముః-

"(2) ఈ సెక్షన్ కింద నిందితుడు ఎవరి దగ్గరికైతే పంపబడతారో ఆ మేజిస్ట్రేట్, కేసును విచారించడానికి తనకు అధికార పరిధి ఉన్నా లేకపోయినా, అతడు సబబుగా భావించినట్లైతే ఎప్పటికప్పుడు ఒక సమయంలో 15 రోజులు మించకుండా మరియు మొత్తంగా 60 రోజులకు మించని కాలానికి నిందితుడిని కస్టడీలో నిర్బంధించడానికి ఆదేశాలు ఇవ్వవచ్చు, కేసును విచారించడానికి లేదా విచారణకు అప్పగించడానికి అతనికి అధికార పరిధి లేకపోతే, మరియు మరింత నిర్బంధం అనవసరమని భావిస్తే, అతను నిందితుడిని అటువంటి సరైన అధికార పరిధి ఉన్న మేజిస్ట్రేట్ ముందుకు పంపమని ఆదేశించవచ్చు.

కానీ –

(ఎ) తన ముందు నిందితుడిని హాజరుపరచనట్లైతే, ఏ మేజిస్ట్రేట్ అయినా ఈ సెక్షన్ క్రింద ఏ కస్టడీలోనూ అతనిని నిర్బంధించడానికి ఆదేశం ఇవ్వకూడదు.
(బి) హైకోర్టు ఈ విషయంలో ప్రత్యేకంగా అధికారం ఇవ్వని రెండవ తరగతి మేజిస్ట్రేట్ ఏ నిందితుడిని పోలీసు కస్టడీ లో నిర్బంధంలో ఉంచడానికి ఆదేశం ఇవ్వకూడదు.

(4) చీఫ్ జ్యుడిషియల్ మేజిస్ట్రేట్ కాక ఇంకే మేజిస్ట్రేట్ అయినా అలాంటి ఉత్తర్వు ఇచ్చినప్పుడు ఆ ఉత్తర్వు కాపీని, దానిని ఇవ్వడానికి గల కారణాలతో పాటుగా, చీఫ్ జ్యుడిషియల్ మేజిస్ట్రేట్ నకు పంపవలయును."

20. ఈ విధమైన అధికార దురుపయోగాన్ని అరికట్టాలని సిఫార్సు చేస్తూ లా కమీషన్ ఇచ్చిన పైన పేర్కొన్న నివేదికల మేరకు ఈ రోజు ఉన్న సెక్షన్ 167 (2) ను సిఆర్‌పిసి, 1973 లో చేర్చారు, ఇది అధిక కాలాన్ని గరిష్టమైన రిమాండ్ సమయంగా నిర్దేశిస్తున్నది , కానీ నిందితులు అహేతుక నిర్బంధంలో లేకుండా చూడటానికి తప్పనిసరి జామీను యొక్క హామీని కూడా ఇస్తుంది, సి ఆర్ పి సి, 1973 యొక్క ఉద్దేశాల వివరణలో 41వ లా కమిషన్ యొక్క నివేదికను ఉదహరించి ఉన్నారు మరియు ఇది ఇతర విషయాలతో పాటు ఈ క్రింది విధముగా తెలుపుతున్నది:-

*"(2)......ఈ చట్టం యొక్క పునర్విమర్శ కోసం 1969 సెప్టెంబరులో లా కమిషన్ నలభై ఒకటవ నివేదిక రూపంలో ఒక సమగ్రమైన నివేదికను ఇచ్చినది. ఈ నివేదిక ఈ నిర్దిష్ట విషయాల పరిశీలనలతో కూడిన పద్నాలుగవ, ఇరవై ఐదవ, ముప్పై రెండవ, ముప్పై మూడవ, ముప్పై ఆరవ, ముప్పై ఏడవ మరియు నలభైవ పూర్వపు నివేదికలలో ఇచ్చిన సిఫారసులను పరిశీలనలోకి తీసుకున్నది.*

*(3) ఇతరములతో పాటు, ఈ క్రింది ప్రాథమిక పరిగణనలను దృష్టిలో ఉంచుకుని, కమీషన్ చేసిన సిఫారసులను ప్రభుత్వం జాగ్రత్తగా పరిశీలించింది-*

*(i) ఒక నిందితుడు సహజ న్యాయం యొక్క ఆమోదించబడిన సూత్రాలకు అనుగుణంగా న్యాయమైన విచారణను పొందాలి;*

*(ii) సంబంధిత వ్యక్తులకే కాకుండా సమాజానికి కూడా హానికరమైన దర్యాప్తు మరియు విచారణలోని జాప్యం జరగకుండా ఉండటానికి ప్రతి ప్రయత్నమూ చేయాలి; మరియు*

*(iii) ప్రక్రియ సంక్లిష్టంగా ఉండకూడదు మరియు సాధ్యమైనంతమేర, సమాజంలోని న్యాయ వర్గాలకు న్యాయమైన వ్యవహారం (డీల్) అందేటట్లుగా చూడగలగాలి.*

*దర్యాప్తు యొక్క ఆచరణాత్మక అనుభవం మరియు క్రిమినల్ కోర్టుల పనితీరు ఆధారంగా ఇతర వర్గాల నుండి తగు విధముగా సూచనలు వచ్చిన చోట పరిశీలించడానికి మరియు అంగీకరించుటకు ఈ సందర్భం ఉపయోగపడినది."*

21. పైన పేర్కొన్న ఉద్దేశాల వివరణ యొక్క పరిశీలన దృఢంగా సూచించేది ఏమిటంటే దర్యాప్తు సంస్థ నిర్దేశించిన కాల పరిమితి లోపల దర్యాప్తును పూర్తి చేసేటట్లు చూడటం కోసం , అలా కానట్లైతే, జామీను పొందడానికి ఇష్టపడే ఏ నిందితుడిని కూడా నిర్బంధంలో ఉండకుండా ఉండేట్లు చూడటం కోసం Cr.PC లోని సెక్షన్ 167 (2) ను పొందుపరచడం జరిగినది. **ఎం. రవీంద్రన్ వర్సెస్ డైరెక్టరేట్ ఆఫ్ రెవెన్యూ ఇంటెలిజెన్స్ (పైన పేర్కొన్న )** కేసులో ఈ కోర్టు యొక్క ముగ్గురు న్యాయమూర్తుల ధర్మాసనం పైన చెప్పిన విషయాన్ని నొక్కి వక్కాణించినది. దీనికి సంబంధించిన పేరాలను ఈ క్రింద పొందుపరచడం జరిగినది:-

*"14వ నివేదికలో కోడ్ ఆఫ్ క్రిమినల్ ప్రొసీజర్, 1898 (వాల్యూమ్. I, 1969, pp. 76-77) గురించి చేసిన సిఫారసులను లా కమిషన్ తన 41వ నివేదికలో పునరుద్ఘాటించినది. "ప్రాథమిక నివేదికల" ను దాఖలు చేయడం ద్వారా సెక్షన్ 167 నిర్దేశించిన పరిధిని మించి నిందితుడిని నిర్బంధంలో ఉంచి తద్వారా 1898 లోని సెక్షన్ 344ను దుర్వినియోగపరచకుండా కాపాడటం*

*చాలా అవసరం అని లా కమీషన్ నొక్కి వక్కానించినది. ఇది "అరెస్టు అయిన వ్యక్తిని నిరవధికంగా నిర్బంధంలో ఉంచి తీరుబడిగా దర్యాప్తు చేయడానికి " అవకాశం కల్పించడం అనే తీవ్రమైన (చట్ట) దుర్వినియోగం జరుగుతుందని సూచించినది. అందువలన కమీషన్ 60 రోజులను నిర్బంధానికి గరిష్ట పరిమితిగా నిర్ణయించడానికి సిఫార్సు చేసినది.*

*ఈ నేపథ్యంలోనే ప్రస్తుతం ఉన్న సి. ఆర్. పి. సి. లో, నేరం యొక్క తీవ్రతకు అనుగుణముగా నిందితుని యొక్క నిర్బంధానికి కాలపరిమితులను నిర్ణయిస్తూ మరియు వైఫల్యం జరిగినప్పుడు నిందితునికి రద్దు చేయజాలని జామీను హక్కును కల్పిస్తూ, సెక్షన్ 167 (2) ను పొందుపరచడమైనది."*

22. **<u>సతేంద్ర కుమార్ ఆంటిల్ వర్సెస్ సిబిఐ & ఇతరులు ((2021) 10 ఎస్సీసీ 773) కేసులో</u>** ఈ చట్ట పరమైన వైఖరిని పునరుద్ఘాటించారు: ఈ కేసులో Cr.PC లోని సెక్షన్ 167 (2) భారత రాజ్యాంగంలోని ఆర్టికల్ 21 యొక్క ఒక అంగము అని, అందువలన నిర్ణీత వ్యవధిలో దర్యాప్తు ప్రక్రియను వేగవంతంగా పూర్తి చేయడం అనేది దర్యాప్తు అధికారుల యొక్క రాజ్యాంగ బద్ధమైన బాధ్యత అనియు, ఇందులో విఫలమైతే, నిందితులు తప్పనిసరి జామీను క్రింద విడుదల కాబడడానికి హక్కు కలిగి వున్నారనియు కోర్టు చెప్పినది. ఈ సంబంధంగా ఈ తీర్పులో వెలిబుచ్చిన అభిప్రాయాలు ఈ క్రింద పొందుపరచబడినాయి:-

*"దర్యాప్తు పూర్తి చేయడానికి గరిష్ట కాలపరిమితికి ప్రాధాన్యత ఇస్తూ 1978లో సెక్షన్ 167 (2) ప్రవేశపెట్టబడింది. ఈ నిబంధన వెనుక ప్రశంసనీయమైన లక్ష్యం ఉంది, వేగవంతమైన దర్యాప్తు మరియు న్యాయమైన విచారణ జరిగేటట్లు చూడడం కోసం మరియు సమాజంలోని నిరుపేద వర్గాల ప్రయోజనాలను*

*పరిరక్షించే హేతుబద్ధమైన విధానాన్ని ఏర్పాటు చేయడం అనే ప్రశంసనీయమైన లక్ష్యం ఈ చట్ట నిర్దేశం వెనక ఉన్నది. ఇది ఆర్టికల్ 21లోని ఒక అంగము కూడా. నిర్దోషిత్వము గురించిన పురోభావన కూడా ఈ నిబంధనలో అంతర్లీనంగా ఉన్నది. అనుమానితుడు కారాగారంలో మగ్గుతున్నందు వలన దర్యాప్తు సంస్థ దర్యాప్తు ప్రక్రియను వేగవంతం చేయాలి. అందువల్ల, నిర్ణీత వ్యవధిలో దర్యాప్తు పూర్తి చేయాల్సిన బాధ్యతను దర్యాప్తు సంస్థపై విధించబడింది మరియు (దీని) వైఫల్యం నిందితుడిని విడుదల చేయడానికి వీలు కల్పిస్తున్నది. దీనికి గానూ పొందుపరచబడిన హక్కు సంపూర్ణమైనది మరియు రద్దు చేయబడజాలనిది అయి , అనుమానితుడి యొక్క ప్రయోజనానికి హామీ ఇస్తున్నది.*

*పైన పేర్కొన్న నిబంధన నుండి లభించే హక్కు పర్యవసానంగా, న్యాయస్థానాలు దానికి తగిన ప్రాధాన్యతను ఇవ్వవలసి ఉంటుంది, ఈ కారణంగా వ్యవధికి మించిన నిర్బంధం ఏదైనా ఖచ్చితంగా చట్టవిరుద్ధం, ఇది సంబంధిత వ్యక్తి స్వేచ్ఛకు భంగకరం. అందువలన, ఒక నిందితుడు సెక్షన్ 167 (2) యొక్క ప్రయోజనాన్ని పొందేలా చూడటం దర్యాప్తు సంస్థకు మాత్రమే కాదు, కోర్టుల యొక్క విధి కూడా."*

23. Cr.PC లోని విధానం ప్రకారం, సెక్షన్ 154 Cr.PC కింద ఎఫ్ఐఆర్ నమోదు చేయడంతో, గుర్తించదగిన కేసు దర్యాప్తు ప్రారంభమవుతుందని గమనించాలి. ఒక వ్యక్తిని అరెస్టు చేసిన తర్వాత, కేసు దర్యాప్తు 24 గంటల్లోపు పూర్తి చేయలేకపోతే, దర్యాప్తును కొనసాగించడం కోసం Cr.PC లోని సెక్షన్ 167 (2) కింద అతని రిమాండ్ కోరడం కోసం అతన్ని మేజిస్ట్రేట్ ముందు హాజరుపరచాలి. అప్పుడు దర్యాప్తు కోసం నిందితుడిని రిమాండ్ లో ఉంచడానికి చట్ట నిర్దిష్టమైన కాలపరిమితి

ఉంటుంది. ఏమైనా ఇది సెక్షన్ 167 (2) (ఎ) (i) లో చెప్పబడిన విధంగా దర్యాప్తు , మరణశిక్ష, జీవిత ఖైదు మరియు 10 సంవత్సరములకు తక్కువ కాని శిక్షలుగా గల నేరాలకు సంబంధించినది అయితే 90 రోజులకు మించకూడదు మరియు సెక్షన్ 167 (2) (ఎ) (ii) ప్రకారం ఇతర నేరాలకు సంబంధించి 60 రోజులకు మించకూడదు. ఈ 90 రోజులు లేక 60 రోజుల సమయం పూర్తి అయిన తరువాత, నిందితుడు, జామీను ఇవ్వడానికి సిద్ధంగా ఉంటే తప్పనిసరి జామీను పొందే హక్కును కలిగి ఉంటాడని సంబంధిత సెక్షన్ నిర్దేశిస్తున్నది.

24. కానీ , నిర్దేశించిన సమయములోగా ఛార్జ్ షీట్ ను దాఖలు చేసినట్లైతే ఈ చట్ట పరమైన జామీనును పొందే హక్కు రద్దు అయిపోతుంది. Cr.PC లోని సెక్షన్ 173 (8) క్రింద అనుబంధ ఛార్జ్షీట్ ను దాఖలు చేయడమనే ప్రశ్న, ప్రధాన చార్జి షీట్ను దాఖలు చేసిన తర్వాతనే వస్తుంది. అందువలన, అనుబంధ చార్జి షీట్ లో దర్యాప్తు ఇంకా పెండింగ్ లో ఉందని స్పష్టంగా చెప్పినంత మాత్రాన ఏ పరిస్థితుల్లోనూ, (దీనిని) తప్పనిసరి జామీను పొందే హక్కును కుంటుపరచడానికి ఉపయోగించడం వీలు కాదు , అలా చేయగలిగినట్లైతే , తప్పనిసరి జామీనును నిర్దేశించిన కారణమే నిష్ఫలం అవుతుంది మరియు చార్జి షీటు లేక అనుబంధ చార్జి షీటు దాఖలు చేయడం అనేది కేవలం తప్పనిసరి జామీను హక్కును కుంటుపరచడానికి లాంఛనప్రాయముగా దాఖలు చేసినదే అవుతుంది.

25. అందువలన తప్పనిసరిగా ప్రథమ దర్యాప్తు పూర్తయిన తర్వాతే , చార్జి షీట్ లేక ఫిర్యాదును నిర్దేశించిన సమయము లోగా దాఖలు చేయాలి మరియు అందులో వైఫల్యం Cr.PC లోని సెక్షన్ 167 (2) క్రింద తప్పనిసరి జామీను హక్కును ప్రేరేపిస్తుంది. **యూనియన్ ఆఫ్ ఇండియా వర్సెస్ తమిషారసి & ఇతరులు ((1995) 4 ఎస్సిసి 190)** కేసులో నార్కోటిక్ డ్రగ్స్ అండ్ సైకోట్రోపిక్ సబ్ స్టాన్సెస్ చట్టము, 1985 క్రింద వచ్చిన కేసును పరిశీలిస్తూ , ఆ కేసులో నిర్దేశిత కాల పరిమితి లోగా దర్యాప్తును పూర్తి చేసి చార్జి షీట్ దాఖలు చేయడంలో వైఫల్యం చెందినా కూడా తప్పనిసరి

జామీనును తిరస్కరించడం గురించి, ఈ విధముగా చెప్పడం జరిగింది. ఇది భారత రాజ్యాంగంలోని ఆర్టికల్ 21 ను ఉల్లంఘించడం అవుతుంది మరియు జామీను మంజూరుపై జంట పరిమితి కూడా వర్తించదు.

26. ఇంకా, **అశోక్ మునిలాల్ జైన్ & ఇంకొకరు వర్సెస్ అసిస్టెంట్ డైరెక్టర్, డైరెక్టరేట్ ఆఫ్ ఎన్ఫోర్స్మెంట్ కేసులో ( (2018) 16 ఎస్సిసి 158)**, సిఆర్‌పిసి లోని సెక్షన్ 167 (2) క్రింద నిర్దేశించబడిన తప్పనిసరి జామీను హక్కు, పిఎంఎల్ఎ లోని విషయాల క్రింద నిందితుడు అయిన వ్యక్తి విషయంలో కూడా రద్దుపరచబడలేని హక్కు అవుతుంది అని చెప్పడం జరిగింది.

27. పైన పేర్కొన్న చర్చల నేపథ్యంలో, ప్రస్తుతం ఉన్న సి ఆర్ పి సి అమలుకు ముందు ఉన్న ప్రాథమిక నివేదికలను దాఖలు చేసే పద్ధతి, ఇప్పుడు దర్యాప్తు పూర్తి చేయకుండా, తప్పనిసరి జామీను హక్కును కుంటుపరచడం కోసం మాత్రమే చార్జి షీటు లను దాఖలు చేసే రూపాన్ని తీసుకున్నట్లుగా మనం గమనించవచ్చు. దర్యాప్తును పూర్తి చేయకుండా చార్జిషీట్లను దాఖలు చేయవచ్చని, దానిని రిమాండ్ ను పొడిగించడానికి ఉపయోగించవచ్చని మనం అంగీకరిస్తే నిందితులకు ఉన్న హామీలతో కూడిన ప్రాథమిక హక్కులు భంగపడడం ద్వారా సిఆర్‌పిసిలో సెక్షన్ 167 (2) ను పొందుపరచడం వెనక వున్న ఉద్దేశ్యం తిరస్కారానికి గురి అవుతుంది.

28. ప్రతివాది తరపున గౌరవ న్యాయవాది ఆధారం ఉంచిన తీర్పులను జాగ్రత్తగా పరిశీలించడము జరిగింది. కానీ, ఈ తీర్పులు ఏవియు, కేవలం తప్పనిసరి జామీను హక్కును కుంటుపరచడం కోసం దాఖలు చేసిన అసంపూర్ణ ఛార్జ్ షీట్ల ను అంగీకరించడం ద్వారా సిఆర్పిసి లోని సెక్షన్ 309 (2) క్రింద రిమాండ్ ను దురుపయోగపరచడాన్ని అంగీకరించవు.

29. ప్రతివాది ఆధారం ఉంచిన **పశ్చిమ బెంగాల్ రాష్ట్రం వర్సెస్ సాలాప్ సర్వీస్ స్టేషన్ & ఇతరుల కేసు ( 1994 సప్లిమెంట్ (3) SCC 318)** ని తీర్పు తప్పనిసరిగా ఇవ్వవలసిన జామీను కు సంబంధించిందది కాదు. ఈ తీర్పు ఇప్పటికే దాఖలు చేసిన ఛార్జి షీటును బలపరుస్తూ అదనపు సాక్ష్యాన్ని దాఖలు చేయడానికి, సిఆర్‌పిసిలోని సెక్షన్ 173(8) క్రింద గల హక్కును, గురించినది.

30. ప్రతివాది ఆధారపడిన **ధరమ్ పాల్ వర్సెస్ హర్యానా రాష్ట్రం మరియు ఇతరుల కేసు ( 2016 (4) SCC 160) లోని** తీర్పు, రాజ్యాంగ ధర్మాసనములకు గల దర్యాప్తును బదిలీ చేసే అధికారాన్ని గురించి చెప్పుతున్నది. ఈ తీర్పులోని 21వ పేరాలో, పోలీసు అధికారికి దర్యాప్తు చేయడానికి మరియు అది పూర్తి అయిన తర్వాత నివేదిక దాఖలు చేయడానికి, సెక్షన్ 173, అధికారం ఇస్తున్నదని మరియు అదనపు దర్యాప్తును చేయడానికి సిఆర్పిసి లోని సెక్షన్ 173 (8) అనుమతిస్తున్నదని చెప్పియున్నారు. ఏది ఏమైనా , ఈ తీర్పు కూడా తప్పనిసరి జామీను గురించి మరియు అనుబంధ చార్జి షీటు లను దాఖలు చేయడం ద్వారా జరిగే దుర్వినియోగం గురించి ఏమీ చెప్పలేదు. మనము గమనించవలసిన ఇంకొక ముఖ్య విషయం ఏమిటంటే **రామ్ నారాయణ్ పోప్లీ వర్సెస్ సిబిఐ ((2003) 3 SCC 641) మరియు రాజేష్ రంజన్ యాదవ్ వర్సెస్ సిబిఐ ((2007) 1 SCC 70) కేసులలోని** తీర్పులు కూడా మనము ప్రస్తుత కేసులో పరిశీలిస్తున్న అంశాలను గురించి వ్యవహరించలేదు.

31. పైన పేర్కొన్న చర్చలను దృష్టిలో పెట్టుకున్నప్పుడు , ప్రతివాది తరఫున గౌరవ న్యాయవాది ఆధారం ఉంచిన కేసులలో వేటిలోనూ ప్రస్తుత కేసులో పరిశీలించబడుతున్న అంశాలు పరిశీలింపబడలేదని స్పష్టంగా విశ్లేషించడం జరిగినందు వలన ప్రతివాదుల తరపున గౌరవ న్యాయవాది ఆ తీర్పులపై ఆధారం ఉంచడమనేది పూర్తిగా పొరపాటు అని అనవచ్చు.

32. పైన పేర్కొన్న చర్చల దృష్ట్యా, మేము రూపొందించిన సమస్యలకు ఈ క్రింది విధంగా సమాధానం ఇవ్వబడిందిః–

I. ఒక కేసు దర్యాప్తును పూర్తి చేయకుండా, అరెస్టు చేసిన నిందితుడికి సి ఆర్ పి సి సెక్షన్ 167 (2) కింద తప్పనిసరిగా ఇవ్వవలసిన జామీను హక్కును హరించడానికి మాత్రమే దర్యాప్తు సంస్థ చార్జి షీట్ లేదా ప్రాసిక్యూషన్ ఫిర్యాదును దాఖలు చేయజాలదు.

II. అటువంటి చార్జి షీట్ ను , మొదట దర్యాప్తు పూర్తి చేయకుండా దర్యాప్తు అధికారి దాఖలు చేస్తే, (అది) సి ఆర్ పి సి సెక్షన్ 167 (2) కింద తప్పనిసరిగా ఇవ్వవలసిన తప్పనిసరి జామీను హక్కును తుడిచిపెట్టదు.

III. అటువంటి సందర్భాలలో, విచారణ కోర్టు, అరెస్టు చేసిన వ్యక్తికి తప్పనిసరి జామీను ఇవ్వకుండా, అతనిని గరిష్ట నిర్ణీత కాలానికి మించి రిమాండ్ లో కొనసాగించజాలదు.

**ఉపసంహారం:**

33. ప్రస్తుత కేసులో, దర్యాప్తు కొనసాగుతుండగా , నిందితునికి 60 రోజుల తర్వాత ఒనకూడిన తప్పనిసరి జామీను హక్కును కుంటు పరిచే ఉద్దేశ్యంతో దర్యాప్తు అధికారి అనుబంధ చార్జిషీట్లను దాఖలు చేశారని స్పష్టమవుతున్నది. ఈ ముఖ్యమైన వాస్తవాన్ని గమనించకుండా విచారణ కోర్టు నిందితుడికి తప్పనిసరి జామీనును ప్రతిపాదించే బదులు దర్యాప్తు అధికారి దాఖలు చేసిన అనుబంధ చార్జి షీట్ లను యాంత్రికంగా అంగీకరించినది మరియు నిర్దిష్ట గరిష్ట పరిమితికి మించి నిందితుల రిమాండ్ ను పొడిగించినది. అందువలన దర్యాప్తు అధికారి మరియు విచారణ కోర్టు కూడా చట్ట నిర్దేశాలను పాటించడంలో వైఫల్యం చెందడం మరియు నిందితునికి ఉన్న హామీతో కూడిన రాజ్యాంగ హక్కులను ఉల్లంఘిస్తూ ఇష్టానుసారముగా ప్రవర్తించడం జరిగినది.

34. నిందితునికి సిఆర్పిసి లోని సెక్షన్ 167 (2) క్రింద లభిస్తున్న తప్పనిసరి జామీను అనే హక్కు కేవలం చట్టబద్ధమైన హక్కే కాదు, ఇది భారత రాజ్యాంగంలోని ఆర్టికల్ 21 క్రింద లభిస్తున్న ప్రాథమిక హక్కు కూడా అన్న విషయం , పునరావృతమే అయినా మళ్ళీ చెప్పడం భావ్యం అని భావిస్తున్నాము. చూడడానికి అంత ప్రధానంగా అనిపించని లాంఛన ప్రక్రియయే ఇది అయినా కానీ దీనికి ఇంత ప్రాముఖ్యత ఇవ్వడానికి కారణం ఏమిటంటే , ఏ నిందితుడు అయిన వ్యక్తి కూడా ప్రభుత్వం యొక్క సహేతుకం కాని నిరంకుశమైన అధికారానికి లోబడకుండా చూడవలసియున్నది కాబట్టి. రిమాండ్ మరియు దర్యాప్తు ప్రక్రియ విషయికంగా దర్యాప్తు అధికారుల యొక్క మరియు నిందితుల యొక్క శక్తికి సంబంధించి ఆచరణాత్మక వ్యక్తీకరణలలో భారీ అసమానత సృష్టించబడుతుంది. న్యాయాన్ని సమకూర్చుకోవాలంటే దర్యాప్తు అధికారులు సజావుగా పనిచేయడానికి అరెస్టు మరియు రిమాండ్ చాలా కీలకం అన్న విషయంలో మనకు ఎటువంటి సందేహం లేనప్పటికీ, అధికారంలోని అసమతుల్యతల గురించి గమనించడం కూడా చాలా ముఖ్యమే. అందువలన దర్యాప్తు సంస్థల చేతిలో నిందితులు వేధించబడకుండా నిరోధించడానికి కొన్ని అదుపులు మరియు అన్వయాలు ఏర్పరచడం చాలా అవసరం.

35. పైన కనుగొన్న పరిష్కారాలు మరియు నిశ్చయాల మూలంగా నిందితునికి జారీ చేయబడిన మధ్యంతర జామీను ఉత్తర్వు నికరం చేయబడింది మరియు ప్రస్తుత రిట్ ధరఖాస్తు తదనుగుణంగా పరిష్కరించబడినది.

**, న్యాయమూర్తి.**
**(కృష్ణ మురారి)**

**,న్యాయమూర్తి.**
**(సి. టి. రవికుమార్)**

**న్యూ ఢిల్లీ;**
**26 ఏప్రిల్, 2023**